క్లుప్తంగా

దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి రాజు తనిఖీ చేశారు. ఈసందర్భంగా నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడానికి ఎరువులతో పాటు పురుగు మందుల శాంపిళ్లు తీసుకున్నారు. కొనుగోలు చేసినవాటి రశీదులను రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఎరువులు, పురుగుమందుల వివరాల బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని బుర్ర వైష్ణవి అండర్–17 విభాగంలో జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైంది. గతేడాది డిసెంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సాఫ్ట్‌బాల్ పోటీలలో కరీంనగర్ జిల్లా జట్టు తరుపున పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పీడీ కొమురోజు క్రిష్ణ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు బుర్ర రవి, లావణ్యను అభినందించారు.

విద్యార్థులను అభినందించిన ఎస్సై



అభినందిస్తున్న ఎస్సై రమేశ్‌గౌడ్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు కరాటే చాంపియన్ పోటీల్లో పలు పతకాలను సాధించగా ఎస్సై రమేశ్‌గౌడ్ సోమవారం అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు హన్మకొండలోని మయూరి గార్డెన్‌లో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ 2024 కప్ పోటీల్లో సత్తా చాటి చాంపియన్ షిప్ ట్రోఫీ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ మినుకుల మునీందర్ తెలిపారు. ఫస్ట్ కటాలో ఆర్. దీక్షరెడ్డి, శ్రీనిధి, స్వాతిక, శ్రీనిధి గోల్డ్ మెడల్స్ సాధించారు. దివ్య, శివబిందు, సిద్ధార్థ సిల్వర్ మెడల్స్, కె. వేణు, శ్రీజ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. నాన్‌చాక్‌లో హర్షిత గోల్డ్, వివేక్ సిల్వర్, సాయి గణేశ్ సిల్వర్ మెడల్స్ సాధించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు రాజు పలువురు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బియ్యం



బియ్యం అందజేస్తున్న గ్రామస్తులు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల ఎంకవ్వ, ఊట్ల పోచవ్వ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను నందికొండ ట్రస్టు వ్యవస్థాపకుడు, నిర్వాహకుడు నందికొండ తిరుపతిరెడ్డి 25 కిలోల చొప్పున బియ్యం వితరణ చేశారు. ఈసందర్భంగా బియ్యాన్ని గ్రామానికి చెందిన సహచరులు కుటుంబాలకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో లింగంపల్లి బాలరాజు, యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవికుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, న్యాలపట్ల లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్, మల్లయ్య, సంపత్, మహేశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ త్వరగా పూర్తి చేయాలి

జమ్మికుంట: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్‌డీవో రాజారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసే విధానాన్ని పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో 12,260 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. తహసీల్దార్ రజని, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూల్చేశారు.. వదిలేశారు

- జెడ్పీహెచ్‌ఎస్ గోడ నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యం
- రోడ్డు విస్తరణలో తొలగింపు
- ఇప్పటికే పాఠశాల స్థలం ఆక్రమణ

చొప్పదండి: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం గోడ నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా పాఠశాల క్రీడా మైదానాన్ని ఆనుకొని ఉన్న ప్రహరీని పనుల నిర్వాహకులు కూల్చేశారు. ఆరు నెలలు గడిచినా తిరిగి నిర్మించకపోవడంతో పాఠశాల స్థలం బహిరంగ ప్రదేశంగా మారింది. ఇప్పటికే క్రీడా స్థలాన్ని పలువురు కబ్జా చేసినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో మిగతా స్థలాన్ని కాపడుతారా లేదా అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.



గోడ కూల్చివేయడంతో బహిరంగంగా పాఠశాల మైదానం

చేతులెత్తేశారు..

శత వసంతాల బాలుర ఉన్నత పాఠశాలకు నాలుగెకరాల 34 గుంటల భూమి ఉండేది. కాలక్రమేణా కబ్జాలు పెరిగి పోవడంతో పాఠశాల స్థలం కుంచించుకుపోయింది. సమీకృత హాస్టల్ ఉన్నచోట ఎకరం ప్రస్తుతం ఉన్న బాలుర ఉన్నత పాఠశాలకు 3 ఎకరాల 34 గుంటల స్థలం ఉండాలి. ఏడాదిన్నర క్రితం పాఠశాల క్రీడామైదానాన్ని ఓ సంఘం ఆధ్వర్యంలో కబ్జాకు ప్రయత్నించగా పాఠశాల పూర్వ విద్యార్థులు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. కబ్జాను అడ్డుకొని ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే పాఠశాల స్థలం ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు షట్టర్లు వేసుకొని దుకాణాలను కిరాయికి ఇస్తు సొమ్ము చేసుకుంటున్నారని, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ, రోడ్లు, భవనాలు, మున్సిపల్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి రావాలిసిన ఆదాయం, ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం పాఠశాల స్థలాన్ని కబ్జాల నుంచి విముక్తి చేస్తామని హడావిడి చేసిన మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు ఆదిలోనే చేతులెత్తేయడం వెనుక మతలబును పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ పాలకులు చేసిన నిర్లక్ష్యం ప్రస్తుత ప్రభుత్వ పాలకులు కూడా కొనసాగిస్తారా అని ఆక్రోశం వెల్లగక్కుతున్నారు.

ప్రైవేటు వాహనాలకు అడ్డా

ప్రహరీ లేక పోవడంతో పాఠశాల స్థలం ప్రైవేటు వాహనాలకు అడ్డా అయింది. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. మూత్ర విసర్జన, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పట్టణం నడిబొడ్డున రూ. కోట్ల విలువైన పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతున్నా కాపాడాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. సెంటర్ నుంచి యాభై అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా ప్రహరీ కూల్చివేశారు. తిరిగి పాఠశాల నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతారు.

– వైద్యుల రాజిరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్(బాయ్స్)

10 జీపీఏ సాధించాలి

సైదాపూర్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పదిలో 10జీపీఏ సాధించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. సోమవారం తను పని చేస్తున్న ఆకునూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ హెచ్‌ఎం రామస్వామి చేతుల మీదుగా అందజేశారు. ప్రణాళికాతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, ఇష్టంతో చదివితే మంచి గ్రేడులు పొందుతారని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

నియామకం



నియామకపత్రం స్వీకరిస్తున్న అనిల్

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొమ్మగల్ల అనిల్‌మాదిగ మానకొండూర్ మండల ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శిగా నియామకమయ్యారు. తన నియామాకం పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగకు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల ఐక్యతకు పోరాడతానని పేర్కొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ



జమ్మికుంటలో అక్షింతల పంపిణీ..

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, ఖాదర్ గూడెం గ్రామాలలో భక్తులు, పాలకవర్గ సభ్యులు భక్తి శ్రద్ధలతో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయవేని రాజు, ఎంపీటీసీ కనవేని శ్రీనివాస్, ఉపసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, భక్తులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గణేశ్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో అయోధ్య రాములోరి అక్షింతలు, కరప్రతాలకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని 22వ వార్డులో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు వితరణ చేశారు. 15వ తేదీ వరకు అక్షింతల వితరణ, 22వ తేదీన అయోధ్యలో శ్రీ బాలరాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన ఉంటుందని సాయంత్రం ఇంటి ముందు దీపాలను వెలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో అవాల రాజిరెడ్డి,స్వామి, కనమల లక్ష్మీ, కొండ్ల సులోచన, మైస భాగ్య, మోతె అర్జున్, తాళ్లపెల్లి తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాములోరి అక్షింతలకు స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన బియ్యంలో కలిపి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

తిమ్మాపూర్: అయోధ్య రాములోరి అక్షింతలను మహాత్మానగర్ జీపీ పరిధిలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కని శ్రీవాణి, ఎడ్ల అర్చన, కేతిరెడ్డి, ప్రేమలత, భూలక్ష్మి ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, పొలవేని గట్టుబాబు, ఎడ్ల అంజిరెడ్డి, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, చిందం శ్రీనివాస్, గూడ తిరుపతి, జెల్ల భూమేశ్, అల్లాడి రఘు, ఇనుకొండ అశోక్ రెడ్డి, ఉల్లెంగుల నవీన్, దుర్శెట్టి అజయ్, అక్షయ్, గుంటుకు కనకయ్య, ఎలుక చంద్రశేఖర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు



తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో..

పూసాల భూమేశ్, పోతు రాజ్‌కుమార్, మామిడాల నిరంజన్, పిట్టల సత్యం, ఎన్నం మునీందర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేసిన మంటపంలో కార్యక్రమం జరిగింది. అంతకుముందు మూల విరాట్‌కు ఫల, పుష్ప, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అయ్యప్ప దీక్ష గొప్పతనం భక్తులకు వివరించారు. పడిపూజ సందర్భంగా ఆలయంలో కార్తీక, మార్గశిర మాసాల్లో అయ్యప్ప మాలధారణ, భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు కోసం భక్తులు రూ.18 లక్షల విరాళం ప్రకటించారు. 18 మంది దంపతులతో కళశ పూజ చేయించారు. మండలంలోని అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ బొడిగె వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, బొడిగె వెంకన్న సింహాచలం హరికృష్ణ, నలుమాచు రామకృష్ణ, కత్తి రమేశ్, దండె సత్యానందం, మునిగాల సుధాకర్‌గౌడ్, పారండ్ల భాస్కర్, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, మేడి మల్లేశం,

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పూజలు

ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి పడిపూజలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ రవీందర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, చీకట్ల రాజశేఖర్, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గంగరెడ్డి, నాగి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలయ అభివృద్ధికి యూఎస్‌ఏలో నివాసముంటున్న పట్టణానికి చెందిన డాక్టర్ సామల మల్లికార్జున్ అర్చన దంపతులు రూ. 25,116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు ప్రకటించారు. ఈమేరకు కమిటీ సభ్యులకు సామల అమ్మతమ్మ, నాగరాజు, తిరుపతిలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, బొడిగె వెంకటేశ్, చేపూరి సత్యనారాయణ, మునిగాల సుధాకర్‌గౌడ్, భైరగోని కిట్టుగౌడ్, గాండ్ల లక్ష్మణ్, కొత్తూరి శంకరయ్య, తదితరులు పాల్గన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు



విరాళం అందిస్తున్న దాతలు



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రభ, స్థానికులు శాలువాలు కప్పి సన్మానించారు. హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, టీచర్లు సంగీత, శ్రీనివాస్‌రెడ్డి, ముకుందరెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందే బదిలీ కాగా సోమవారం వీడ్కోలు పార్టీ నిర్వహించినట్లు జయప్రభ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అందె స్వరూప, ఎంపీటీసీ స్వప్న, ఎస్‌ఎంసీ చైర్మన్ ఉస్మాన్, లక్ష్మిచారిటబుల్ ట్రస్టు చైర్మన్ జి. రఘునాథరెడ్డి పలువురు ఉన్నారు.

క్రైం కార్నర్

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ రమేశ్

జమ్మికుంట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో టౌన్ సీఐ బార్పటి రమేశ్ బాధితుడికి అప్పగించారు. మున్సిపల్ పరిధి పాత సిటీకేబుల్ లైన్‌కు చెందిన వెంకట్‌రావు నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఓ కిరాణం షాపుకు వెళ్లి రూ.15వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను మరిచిపోయాడు. ఇంటికెళ్లి మళ్లీ షాపు వద్దకు వచ్చి వెతకగా సెల్‌పోన్ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి హైదరాబాద్‌లోని శామీర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి ఫోన్ రికవరీ చేశారు. ఈసందర్భంగా బాధితుడు పోలీసులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అదృశ్యం కేసు నమోదు

వీణవంక: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని కరీంనగర్ అల్ఫోర్స్ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 6న కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పిన విద్యార్థిని సోమవారం వరకు ఇంటికి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్లలోనూ సంప్రదించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అదనపు వరకట్నం కేసు..

అదనపు వరకట్న వేధింపులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని బొంతుపల్లికి చెందిన రెవెల్లి ప్రణయాంజలికి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తలోడ గ్రామానికి చెందిన మోహన్‌రావుతో వివాహమైంది. కొంత కాలంగా భర్త, అత్తమామలు, బంధువులు అదనపు కట్నం తీసుకరావాలని, శారీరక, మానసికంగా వేదించి, పుట్టింటికి వెళ్లగొట్టారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రైస్‌మిల్ వ్యాపారి రిమాండ్

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులోని రైస్‌మిల్‌ను కిరాయికి తీసుకున్న ఓ వ్యాపారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం కస్టం మిల్లింగ్ రైస్ అప్పగిస్తే రైస్‌మిల్‌లో ధాన్యం నిల్వలు లేకపోవడంతో సివిల్‌సప్లై అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యాపారి అనిల్‌పై కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు మూడురోజుల క్రితమే అరెస్టు చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. ఈవిషయంపై రూరల్ సీఐ సంతోశ్‌కుమార్‌ను వివరణ కోరగా సివిల్‌సప్లై అధికారుల ఫిర్యాదుతో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సోమవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలని పట్టణానికి చెందిన లబ్ధిదారులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం మొదటి విడుత నిధులతో యూనిట్లను ఏర్పాటు చేసుకున్నామని, రెండో విడుత కోసం దరఖాస్తు చేసుకున్నామని, అధికారులువెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశారన్నారు. ఎన్నికల కోడ్‌రావడంతో రెండో విడుత నిధులు మంజూరు నిలిపివేశారని వివరించారు. కార్యక్రమంలో రాజేశ్, కొంరయ్య, మల్లయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న లబ్ధిదారులు

హుజూరాబాద్: దళితబంధు పెండింగ్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

నిరాహార దీక్ష చేస్తా

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ఆరోవార్డు హౌజింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ భూమిలో కౌన్సిలర్ శ్రీపతినరేశ్ అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని, చర్యలు తీసుకోకపోతే నిరాహార దీక్ష చేస్తానని మాజీ వార్డు సభ్యుడు తూడి రవీచందర్‌బాబు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై గతంలో మున్సిపల్ కమిషనర్, కలెక్టర్, వరంగల్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ), వరంగల్ హౌజింగ్ బోర్డు సొసైటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)కు ఫిర్యాదు చేశానని, వరంగల్ హౌజింగ్ బోర్డు ఏఈ అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించి చర్యలు తీసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేశాడన్నారు. కానీ నేటివరకు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోలేదని, అధికారులు కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోనట్లయితే 11న జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు.

గడువులోగా పూర్తిచేస్తాం



ఆన్‌లైన్ ప్రక్రియలో నిమగ్నమైన సిబ్బది

శంకరపట్నం: తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తామని ఎంపీడీఓ శ్రీవాణి సోమవారం తెలిపారు. 20 మందితో ఆన్‌లైన్ చేయిస్తున్నామని, మండలంలోని 24 గ్రామాల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. 2,355 రేషన్ కార్డుదరఖాస్తులు వచ్చాయన్నారు. మొలంగూర్‌లో అత్యధికంగా 1,238, అత్యల్పంగా మక్త గ్రామం నుంచి 66 వచ్చాయన్నారు. ఇళ్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, పంచాయతీ ఆపరేటర్లు, రెవెన్యూ, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

హుజూరాబాద్: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని నాబార్డు ఏజీఎం జయప్రకాశ్ అన్నారు. స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు రోలింగ్, పాలింగ్‌పై శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జయప్రకాశ్ హాజరై మాట్లాడారు. చిన్నచిన్న ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ముందుకు వెళ్లాలని, టెక్నాలజీకి అనుగుణంగా నూతన విషయాలను నేర్చుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గౌతమి, కోఆర్డినేటర్ సునీల్, ట్రైనర్ లతరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేపట్టాలి

చిగురుమామిడి: మండలకేంద్రంలోని మినీబస్టాండ్ వద్ద రెండ్రోజులుగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు ఏర్పాటుచేసిన విద్యుత్ బల్బులు వెలగడం లేదు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్ సిస్టం సైతం పనిచేయడంలేదు. దీంతో ప్రయాణికులు రాత్రివేళల్లో బస్సులకోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

